# రాంగ్ రూట్ బుష్‌కోటు

సుబ్బారావు వాచీ చూసుకున్నాడు. అది ఆగిపోయి ఉంది. 'కీ' యిచ్చినా అరగంటకన్నా ఎక్కువ తిరగదు. తిరిగితే ఎంత? తిరగకపోతే ఎంత? 'వాచీ చేతి భూషణం' అన్నారు దాని ఉపయోగమూ అంతవరకే దగ్గిర నిమషానికి సరిగ్గా టైము చూడ్డం రాని ఆడాళ్ళ చేతిని వాచీలు చాశాడతను సంస్కృతికీ, శిల్పానికి తావియ్యక, చాలామంది చిన్నపిల్లలు తెలీక రంగురంగుల బొమ్మలకోసం, పెద్దవాళ్ళలా వాళ్ళ చేతికి వాచీలకోసం అల్లరి పెడతారు ఆ వాచీలు తిరగకపోయినా సంతోషం తగ్గదు రంగురంగుల రబ్బరు బొమ్మల గుండెలు కొట్టుకోకపోయినా వాళ్ళు ప్రేమించగలరు సుబ్బారావులాంటి చాలామంది పెద్దలూ అంతే రంగులూ, అలంకారాలూ కావాలి వాళ్ళకి వాటి ప్రయోజనం సంగతి ఆలోచించనే ఆలోచించరు

సుబ్బారావు వాచీవైపు సగర్వంగా చూసుకున్నాడు అయితే ఆ గర్వం ఆట్టే సేపు నిలబడలేదు కాళ్ళదగ్గిర కూర్చున్న ఓ మనిషి 'ఎంతేసినారు బాబూ?' అని అడిగేశాడు తన్ని ఏడిపించడానికిగాని వీడికి టైమెందుకు? అయితే ధీరుడైన సుబ్బారావు ఊరుకోలేదు తడుముకోకుండా 'తొమ్మా, యిరవై' అన్నాడు అయితే దీనికి ప్రతి సమాధానం వస్తుందని సుబ్బారావు ఊహించలేదు 'క్షమించాలి మేషారూ అంత అవలేదు మీ వాచీ ఫాషు తిరుగుతోందేమో—పావు తక్కువ ఆరయిందోయ్' ఇలా జవాబిచ్చిన కోయిలకంఠివైపు సుబ్బారావు దృష్టి సారించాడు రెండు బెంచీల అవతల ఆవిడ కూర్చుంది ఓ మూలగా అప్పుడే వెలిగిన పాసింజరు లైటు వెలుగులో ఆవిడ అప్సరసలా కనిపించింది సుబ్బారావు కళ్ళకి. నాలుగురోజులు వరసగా మాట్లాడితే ఆడదాని కంఠం ఎలా ఉంటుందో, నాలుగేళ్ళు కాపురం చేస్తే ఆడది ఎలా మారిపోతుందో యిరవై ఏళ్ళ సుబ్బారావుకేం తెలుసూ? ఆ క్షణానికి మాత్రం ఆవిడ కంఠం కోయిలకంఠంలా, ముఖం పద్మంలా ఉన్నాయి సుబ్బారావుకి

ఇంతవరకూ ఈవిడని గమనించనందుకు సుబ్బారావు నొచ్చుకున్నాడు ఈ 'సౌందర్య తిలక' ఏ 'హంపీ' స్టేషనులో ఎక్కిందో? తను యిలా బయలుదేరింది ఈ 'చిలకల కొలికి'ని కలుసుకోడానికేనా? అసలు తనెందుకు బయలుదేరినట్టు?

సుబ్బారావు స్వస్థలం తుని వాళ్ళ తండ్రి బెల్లం వ్యాపారం చేసి ఏదో ఉన్నవాడు అనిపించుకున్నాడు సుబ్బారావు ఒక్కడే మొగపిల్లాడు అవడంచేత కాస్త ముద్దుగా పెరిగేడు స్కూలు ఫైనలుతో కుస్తీ పట్టి పట్టి, దండయాత్రలలో గజనీ మహమ్మదును తలదన్ని—ఇక స్కూలు ఫైనలు దాటలేనని, ఫైనలుగా స్కూలే విడిచిపెట్టేశాడు తండ్రి అక్కడితో వీడిమీద ఆశా విడిచిపెట్టేశాడు. అభాగ్యులైన తోటి విద్యార్థుల్లా — చెదపురుగు చదువుతో శరీరాన్ని గుల్లచేసుకోనందువల్ల— అమోనియా పిండి ఎరువుతో బలిసిన మామిడి పండులా పదహారేళ్ళకే పహిల్వాను అయ్యాడు అలా యిక్కడా అక్కడా కబుర్లు చెపుతూ- చీకూ చింతా లేకుండా- ఈ నాలుగేళ్ళూ గడిపేడు.

## అవసరాల రామకృష్ణరావు

'వీడికి పెళ్ళేనా చెయ్యండి' అంటుంది తల్లి

'ఎందుకూ? వీడ్ని కన్నందుకు 'రాముల వారి పెళ్ళి'లా మనకి నిత్యం జరుగుతున్న పెళ్ళి చాలదూ? వీడికి ఉన్న 'క్వాలిఫికేషన్లు' చాలు' అనేవాడు తండ్రి

ఇదిలా ఉండగా రైల్వేవారి శతదినోత్సవాల ధర్మమా అని 'గో వేర్ యు లైక్' టిక్కట్లు అమ్మేరు. రెండ్రోజులు సుబ్బారావు మంచంబట్టె ప్రయాణానికి పంపకపోతే 'పోలీసు నూతి'లో పడతానని బెదిరించగా - వీడి అల్లరి, అమాయకురాలైన పెళ్ళాం గోలా ఎక్కువై చేసేదిలేక - పున్నామ నరకంలోంచి తప్పించుకోలేక - ఆ వెర్రి తండ్రి బొడ్లో తాళాలు తీసి కొడుకు మొహాన్న గొట్టేడు మందం మించి ఎగిరి గంతేసి ఆ మాయదారి కొడుకు మరునాడే రైలెక్కేడు!

బాగా చీకటి పడింది. రైలు కిటికీలోంచి చూస్తే నక్షత్రాలు తప్ప మరేం కనిపించడంలేదు. 'ఈరాత్రి ఏ ఊళ్లో దిగుదామా?' అన్న ఆలోచనతో కొట్టుకుంటున్న సుబ్బారావు అప్రయత్నంగా ఆ అమ్మాయివైపు చూశాడు. ఆ అమ్మాయి సరిగ్గా తనవైపే చూస్తోంది ఎందుకలా చూడాలి? సుబ్బారావుకి గిలిగింతలు పెట్టినట్టయింది ఆ ప్యాసంజెరు పెట్టిలో ఆట్టే మంది లేరు సుబ్బారావూ, ఆ అమ్మాయీ, మరో నలుగురు మొగాళ్లూ, ఒక ముసలావిడాను.

ఖరగ్‌పూర్‌లో నూకరాజు ఉన్నాడు. పన్నెండింటికి ఖరగ్‌పూర్ చేరుతుంది రైలు.

ఈ రాత్రికి అక్కడుండిపోయి - రేపల్లా అక్కడ గడపలేనో? - ఎల్లుండి కావలిస్తే కలకత్తా వెళ్లొచ్చు బాగుం దనుకున్నాడు సుబ్బారావు

ఆ అమ్మాయి మళ్లీ తనవైపు చూస్తోంది. ఎప్పుడూ లేంది తనకు సిగ్గేస్తోంది. ఎందుకు వెయ్యాలి? ఆ అమ్మాయి తన గుండెలవైపే ఎందుకు చూడాలి మరి? తన మీద తనకెంతో అభిమానం వేసింది సుబ్బారావుకి. లెట్రిన్‌లోకి వెళ్ళి అద్దంలో తన ముఖం ఆనందంగా చూసుకున్నాడు. ఎత్తైన తన ఛాతీని సగర్వంగా చూసుకున్నాడు. అందుమీద మెరుస్తున్న ఆరెంజ్ కలర్ బుష్‌కోటు - సంతోషంతో ఎగురుతున్నట్టుంది. ఆ అమ్మాయికి తను కావాలా? తన్ని పెళ్ళి చేసుకుంటుందా? ఊటలూరుతున్న ఆలోచనలతో తన సీటు చేరుకున్నాడు.

'ఏ వూరు వెడతారో అడగవచ్చునా?' కష్టపడి వాక్యాన్ని ఫ్రేంచేసి, ధైర్యం చేసి అడిగేశాడు సుబ్బారావు

'దాని కేముంది! ఇంకా రెండు స్టేషన్లున్నాయి కాని చాలా రాత్రయిపోయింది. మీరు?' సుబ్బారావు అవకాశాన్ని జారవిడుచుకోలేదు. ఈ బైరాగి టిక్కట్టుతో ఎక్కడేనా దిగొచ్చుగా! ఆ వూరూ చూసినట్టు ఉంటుంది, ఈవిడని దిగబెట్టినట్టూ ఉంటుంది. అదృష్టం ఉండాలి గాని తను ఆ వూరి అల్లుడు అయే అవకాశం మాత్రం ఎందుకు లేదు? - ఏ అవకాశమూ లేకపోతే ఈ సుందరాంగి తనవైపు, తన ఛాతీవైపు అస్తమానూ ఎందుకు చూడాలి?

ఆవిడ్ని గురించి ఇంకేమీ అడగలేకపో

దేసు. వాళ్ళ వాళ్ళు తనగురించే అన్ని సంగతులూ అడిగే శుభ క్షణాలు రావచ్చు. ఎవరు చెప్పగలరు? – ఈ పగటి కలలతో – హైలుఊపులతో పదకొండు అవనూ అయింది, ఆ వూరు రానూ వచ్చింది. సుబ్బారావు గబుక్కుని లేచి నిలబడ్డాడు. అమ్మో, ఆవిడ నిద్రపోతున్నట్టుంది!

'ఏమండీ - మిమ్మల్నే - లేవండి, స్టేషను వచ్చేసింది!' ఆవిడ ఉలికిపడి లేచింది.

'చాలా థ్యాంక్సండీ! లేపకపోతే ఏ కలకత్తాలో లేచేదాన్నో!' ఆవిడ డోర్ దగ్గర నిలబడి అయిదునిమిషాలు ఇటూఅటూ చూసింది. ఇంత మొహం చేసుకుని – 'ఉత్తరం అందలేదు కాబోలు – ఎవరూ రాలేదు' అంది.

'ఫరవాలేదు – నేనూ వస్తాగా... దిగండి, సామాన్లన్నీ లెక్క పెట్టి, దింపించి ఆవిడ్ని జట్కా ఎక్కించాడు సుబ్బారావు.

'సమయానికి మీరు సహాయం చేశారు గాని...' అంది ఆవిడ.

'ఆ, దానికేముంది? నాకీ వూళ్లో ఎలాగా పనుందిగా!' అన్నాడు సుబ్బారావు.

ఈ అన్నలమిన్న తనని ఎలాగా ఈ రాత్రికి ఉంచేస్తుంది, తండ్రికి పరిచయం చేస్తుంది... ఆ తరవాత? సిగ్గేసింది సుబ్బారావుకి.

'మీది ఈవూరేనా?'

'ఆఁ' అనేశాడు సుబ్బారావు ఐస్ అయిపోతూ.

'ఈ పక్క గల్లీలోనే నా యిల్లు'

'అలాగా?'

'ఒకటడుగుతాను – మరోలా అనుకోరు గదా?'

ప్రేమ, పాకాన్ని పడింది. సుబ్బారావు మనస్సు గజం ఎత్తున ఆకాశంమీద ఉంది. ఇలాంటి పట్టులోనే తను బెట్టు చెయ్యాలి!

'అడగండి, దానికేం?'

'ఈ బుష్‌కోటుకి, గుడ్డ ఈ వూళ్లోనే కొన్నారా?'

తన బట్టలగురించి కూడా అడుగుతోంది! వాళ్ల నాన్నతో చెప్పి రకరకాల బట్టలూ, కోట్లూ కుట్టిస్తుంది కాబోలు!

ఆహా, ఏమి, నా భాగ్యమూ? అనుకున్నాడు సుబ్బారావు.

కాదనడ మెందుకు – అనుకుని–

'ఈ ఊళ్లోనే కుట్టించుకున్నాను– ఏం?' అని అడిగేడు సుబ్బారావు.

'ఇందాకటినుంచి చూస్తున్నాను– సరిగ్గా అదే రంగు' అంది ఆవిడ.

'ఏమిటి?' అని అడిగేడు సుబ్బారావు ముందు సంభాషణ ఎంత ముళ్ళదారిలా, కర్ణకఠోరంగా తన చెవికి ఉంటుందో తెలీక.

'అదే–మీరు తొడుక్కున్న బుష్‌కోటు రంగు.'

'దేనికి?' అన్నాడు సుబ్బారావు.

'ఇంకా యిలాంటి గుడ్డ దొరుకుతుందా? మరోలా అనుకోకుండా వుంటే రేపో, ఎప్పుడో మీరు వీలయినప్పుడు నాలుగు గజాలు తెచ్చి పెడతారా?'

ఎంత చనువు వచ్చేసింది అప్పుడే! తన జాకట్లకి గుడ్డ సహా పురమాయిస్తోంది! తెల్లవారాలే గాని – ఊరంతా గాలించిఅయినా తాను గుడ్డ కొని ఈ 'ఫుల్ మూను'ను కప్పకపోతే తాను ఎందుకూ?

'తప్పకుండా తెచ్చి పెడతాను' అనేశాడు. అనడు మరీ?

'మరేం లేదు. మా ఆయనకి యిలాంటి బుష్‌కోటు గుడ్డలూ – యీ రంగులూ ఫేషన్లూ అంటే వెర్రి అభిమానం – ఆమధ్య ఒక షాపులోకి అచ్చు యిలాంటి గుడ్డే వస్తే ఆయన ప్రెండు కుట్టించుకున్నాడు. ఆయనా కుట్టించుకుందామని 'కన్నవేషను' కోసం నన్ను 'షాపింగ్'కి రమ్మన్నారు. నేను వంటలో కొంచెం 'డిలే' చేశాను. ఆ రకం గుడ్డ అయిపోయింది. అన్నయ్యలాంటివారు కాబట్టి మీతో చెబుతున్నాను– ఆరోజునుంచి వారు నన్ను దెప్పని రోజు లేదు. ఆతర్వాత రెండుసార్లు వెళ్ళినా సరిగ్గా యిలాంటి గుడ్డ దొరకనే లేదు. మళ్లీ ఆ రకం గుడ్డ యివాళే చూశాను. మా యిల్లు వచ్చేసింది. వస్తానూ! రేపు కనపడతారుగా!' ఆవిడ దిగిపోయింది. ఆవిడ ప్రేమించిందీ, కాంక్షించిందీ తన్ని కాదా? తన రూపాన్ని కాదా? అంతసేపూ చూసింది– ఈ దిక్కుమాలిన బుష్‌కోట్‌నేనా?

సుబ్బారావు కోపంగా బుష్‌కోట్‌ను విప్పి కాలవలో పారేశాడు. ఆనాటినుంచి అతనెప్పుడూ బుష్‌కోటు తొడుక్కోలేదని తెలిసినవాళ్లు చెప్పుకుంటూంటారు! ★


సిద్ధముగ నున్నది.

డాన్ క్విక్ సెట్

(DON QUIXOTE)



మూలం :

సెరివాన్‌టెజ్

అనువాదం :

విశ్వాత్ముల నరసింహమూర్తి

తపాల ఖర్చు ప్రత్యేకం.

వెల రెండురూపాయలు

ఆంధ్ర గ్రంథమాల

మద్రాసు 1.

తయారౌతున్నది.

బొమ్మల కథల పుస్తకం

పంచతంత్రం

మొదటి భాగం

(మిత్రభేదం, మిత్రలాభం)

కర్త: విశ్వాత్ముల నరసింహమూర్తి

మీ కాపీ రిజర్వు చేసుకోండి.

ఆంధ్ర గ్రంథమాల

మద్రాసు– 1

